క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి వచ్చే రబీ సీజన్‌లో పంటలను సాగు చేసుకోవాలని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మ భవన్‌లో అధికారులు వ్యవసాయ సలహా మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌లో చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి, రైతులు పాల్గొన్నారు .

బిజినవేములలో వీధిదీపాల ఏర్పాటు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో శుక్రవారం వీధి దీపాలను అమర్చినట్లు గ్రామ సర్పంచ్ రవియాదవ్ తెలిపారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

మిడుతూరు: ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీ డీఓ జీఎస్ఎస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మిడుతూరు- 1, మిడుతూరు-2 సచివాలయాలను తనిఖీ చేశారు. సమయపాలన పాటించడంతోపాటు ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

రైతుల నుంచి పత్రాలు సేకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్

కొత్తపల్లి: భూ రీసర్వే కోసం రైతుల వద్ద నుంచి అన్ని ధ్రువీకరణ పత్రాలను సేకరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. కొత్తపల్లి, శివపురం గ్రామాల్లో రెండో విడత భూ రీసర్వే పనులు ప్రారంభమయ్యాయన్నారు. మూడో విడతకు మిగిలిన గ్రామాల పొలాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాలు సేకరించాలని వీఆర్వోలకు సూచించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు: సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ రైతులకు సూచించారు. పట్టణంలోని 3వ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో నిర్వహించారు. మండల వ్యవసాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా ఈనెల 15లోపు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కాగా లింగాకర్షణ బుట్టలు, తెలుపు, నీలం, పసుపు జిగురట్టలు, వ్యక్తిగత ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇవ్వాలని రైతులకు కోరారు. సమావేశంలో సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఏఈఓ సుధారాణి తిదితరులు పాల్గొన్నారు.

ఆడుతూ...పాడుతూ

- అంగన్‌వాడీలో సమూల మార్పులు
- ఆట పాటల ద్వారా బోధన.. ఆంగ్ల అక్షరాలు, అంకెల గుర్తింపు

అసలే చిన్నారులు.. అమ్మఒడిలో సేద తీరడం.. తోటి వారితో కలిసి గెంతులేయడమంటే వారికి భలే సరదా. అలాంటి చిన్నారులను ఒక చోట కూర్చోబెట్టడమంటే వారి బాల్యాన్ని హరించడమే. అందుకే రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించింది. అంగన్‌వాడీలలో ఆటపాటల ద్వారా విద్య నేర్పేందుకు చర్యలు తీసుకుంది. బొమ్మలు, ఆట వస్తువులతో కూడిన కిట్లను అందజేసి వాటి ద్వారా అంకెలు, ఆంగ్ల అక్షరాలు చేర్పిస్తూ ప్రాథమిక విద్యకు సన్నద్ధం చేస్తోంది. – నందికొట్కూరు

చిన్నారుల సంరక్షణ, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ప్రభుత్వం.. మరో అడుగు ముందుకేసి ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్యకు సన్నద్ధం చేస్తోంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్స్‌గా మార్పు చేసింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సిలబస్ ప్రకారం చిన్నారులకు బోధన చేస్తున్నారు. అందుకు కావాల్సిన బొమ్మలు, ఆట వస్తువులతో కూడిన కిట్లను ప్రభుత్వం సమకూర్చింది. వాటి ద్వారా చిన్నారులకు అర్థమయ్యేలా విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఆంగ్ల పదాలు పలకడం, అంకెలు గుర్తించి చెప్పడం నేర్పిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిషు వర్క్‌బుక్‌లో ఏ అక్షరం నుంచి జడ్ అక్షరం వరకూ పరిచయం ఉంటుంది. గణితం వర్క్‌బుక్‌లో 1 నుంచి 10 అంకెల పరిచయం ఉంటుంది. యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, రంగులు వేయడం తదితర అంశాలు నేర్పుతున్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో

నందికొట్కూరు నియోజకవర్గంలో 285 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 4,344 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. 281 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరుగురు మినీ కార్యకర్తలు ఉన్నారు. 281 మంది ఆయాలు పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో అన్నింటినీ ప్రీప్రైమరీ స్కూల్స్‌గా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. ప్రీప్రైమరీ స్కూల్స్‌లో రెండు తరగతులుగా బోధన ఉంటుంది. ప్రీప్రైమరీ-1లో మూడేళ్లు నిండిన చిన్నారులకు, ప్రీప్రైమరీ-2 స్కూల్స్‌లో నాలుగేళ్లు నిండిన పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట పాటలతో విద్యా బోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

సృజనాత్మకత పెరుగుతుంది



ప్రీప్రైమరీ స్కూల్స్‌గా అప్‌డేట్ అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సృజనాత్మకత పెంచే బోధన అందిస్తున్నాం. ఇంగ్లిషు, లెక్కల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధన సాగిస్తున్నాం. ఇది రేపటి భవిష్యత్తుకు పునాది లాంటిది. –కోటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, నందికొట్కూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



మా పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లిషు నేర్పిస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లకు పంపే స్తోమత లేని మా పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇంగ్లిషు చెబుతున్నారు. మా బాబుకు నాలుగేళ్లు ఏబీసీడీలు పలకపై రాయడంతో ఎంతో ఆనందంగా ఉంది. మా పేద పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.
– మరియమ్మ, శాతనకోట, నందికొట్కూరు మండలం

ఏబీసీడీలు చెబుతున్నాడు



మా బాబుకు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఏబీసీడీలు నేర్పిస్తోంది. ఇంటికి వచ్చిన తర్వాత ఇంగ్లిషులో ఏబీసీడీలు చెబుతుంటే సంతోషంగా ఉంది. ఇంతకు ముందు తెలుగులో అ, ఆలు వచ్చేవి కావు. ఇప్పుడేమో ఇంగ్లిషులో చెప్పడమే కాకుండా పలకపై రాస్తున్నాడు. మా పిల్లల భవిష్యత్తుపై జగనన్న ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.
– షబానా, మిడుతూరు మండల కేంద్రం

ప్రైవేట్‌కు దీటుగా బోధన



ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ స్కూల్స్‌లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధన అందిస్తున్నారు. చిన్నప్పటి నుంచి చిన్నారుల్లో చదువుపై ఆసక్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. తద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారు.
– జి.పుష్పలత, అంగన్‌వాడీ వర్కర్, సుబ్బారావు పేట, నందికొట్కూరు

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్తున్న శ్రీకృష్ణుని విగ్రహం

పగిడ్యాల: మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో యాదవులు ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని శుక్రవారం పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సన్మానం



మహానంది: రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రఘునాథరెడ్డిని శుక్రవారం ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అధ్యాపకులు డాక్టర్ నజీరుద్దీన్, రామసుబ్బారెడ్డి, సురేష్, ప్రసాద్ తదితరులు సన్మానించారు.

మహానందం...పల్లకోత్సవం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శ్రావణమాసం, శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవం మహానందంగా సాగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ ముందు గోమాతను ఉంచి ఆలయ ప్రాకారంలో ఉత్సవం కనులపండువగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.



పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మహానందీశ్వర దంపతులకు శాంతి కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు శుక్రవారం శాంతి కల్యాణ పూజలు వైభవంగా జరిగాయి. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అక్షింతల సమర్పణ, మాంగళ్యధారణ, పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా పీర్ల గ్రామోత్సవం

మహానంది: మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామంలో పీర్ల జార్తాల వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పీర్ల గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు మఖానానికి చేరుకుని మౌలాలిస్వామి, దస్తగిరిస్వామి, చిన్న మౌలాలిస్వామి వార్లకు పూల సూచికాలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అలాగే గోపవరం గ్రామంలో జార్తాలు వైభవంగా నిర్వహించారు. తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన కళాకారుల కోలాటం భక్తులను అలరించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పీర్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మిడుతూరు: గురుపూజోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంఈఓ-1 రామిరెడ్డి, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, ఎంఈఓ -2 శ్రీనాథ్, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి

పాఠశాల తనిఖీ

పగిడ్యాల: మండలంలోని బీరవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యాధికారి సుభాన్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలో వాంతులు, విరేచనాల కేసులు అధికంగా ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయుడు వాసుకు సూచించారు. కుళాయి నీటిని వాడరాదని, ఫిల్టర్ నీటిని తెప్పించుకోవాలని సూచించారు. అతిసార వ్యాధి తగ్గుముఖం పట్టే వరకు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకున్న తర్వాతే విద్యార్థులకు భోజనాలు వడించాలన్నారు. పిల్లలు అస్వస్థతకు గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందేలా చూడాలని ఆయన సూచించారు.

తల్లీబిడ్డ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపల్లి: తల్లీబిడ్డ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బండినాయిని పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే కడుపులోని శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

నందికొట్కూరు: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని న్యాయవాది కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే పార్టీకే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు పాలూరి శ్రీనివాసులు, అంజనేయులు, బలరాముడు, శివమణి, నరసింహులు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి

నేషనల్ హైవే పనుల అడ్డగింత



హైవే పనులను అడ్డుకున్న దామగట్ల గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని దామగట్ల గ్రామం వద్ద జరుగుతున్న నేషనల్ హైవే 340సీ పనులను గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. హైవేలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్తులు మాధవరం రత్నం, ఉసేన్‌సాహెబ్, బాబుసాహెబ్, వీరభద్రుడు తదితరులు డిమాండ్ చేశారు.

11, 12 తేదీల్లో మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

జూపాడుబంగ్లా: ఈనెల 11, 12 తేదీల్లో వివిధ పాఠశాలలకు చెందిన మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక ఉంటుందని క్రీడల మండల కోఆర్డినేటర్, మండ్లెం వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 11న బాలురకు, 12న బాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్ మొదలైన క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రాంతి స్కూల్ ఫౌండర్ మృతి

వెలుగోడు: పట్టణంలోని క్రాంతి వికలాంగుల స్కూల్ ఫౌండర్, చైర్మన్ కేఎండీ షరీఫ్ అలియాస్ బుడెబా(77) శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి.. షరీఫ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూడా సంతాపం తెలిపినట్లు భువనేశ్వర్‌రెడ్డి చెప్పారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

జూపాడుబంగ్లా: ఉపాధిహామీ పనులపై శనివారం బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు రూ.6.09 కోట్లతో 12 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులపై ఇప్పటికే సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందని, ఆ వివరాలను బహిరంగ సభలో వెల్లడించనున్నారని తెలిపారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

వెలుగోడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. నవ భారత అక్షరాస్యత కార్యక్రమం, అమ్మ – నాన్న చదువు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, వయోజన విద్యను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిజ, ఏపీఓ బీవీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

కొత్తపల్లి: వ్యవసాయ కూలీల ఆటో బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్ శివకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం తెలిపారు. ఈనెల 7న పాములపాడు నుంచి కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి శివకృష్ణ తన ఆటోలో ఆరుగురు వ్యవసాయ కూలీలతో తీసుకెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. నిర్లక్ష్యంగా ఆటోను నడపడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందనే ఆరోపణతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కన్యకమ్మకు కలువ పూల అలంకరణ





కలువ పూల అలంకరణతో అమ్మవారు, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు/రూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని భక్తులు కలువ పూలతో అలంకరించి పూజించారు. శ్రావణ మాసం ఆఖరు శుక్రవారం సందర్భంగా పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పువ్వాడి భాస్కర్ రెండువేల కలువ పూలు తెప్పించి అమ్మవారికి విశేషంగా అలంకారం చేయించారు. ఆర్య వైశ్య మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుని కుంకుమార్చన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

సంపూర్ణ ఆరోగ్యంపై మహిళలకు శిక్షణ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ కావేరి గ్రామైక్య సంఘంలో శుక్రవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆహారం, పోషణ, ఆరోగ్యం అండ్ పారిశుద్ధ్యంపై పొదుపు మహిళలకు రిసోర్స్ పర్సన్ చెన్నమ్మ శిక్షణ ఇచ్చారు. వైఎస్సార్ క్రాంతి పథం మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోకపోవడం వలన రక్తహీనత బారినపడి మృత్యువాత పడుతున్నారన్నారు. మాతా, శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో సీసీలు, వీబీకేలు ఉన్నారు.



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ చెన్నమ్మ

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాపరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై 55 మంది నిరుద్యోగులను ఎంపిక చేసుకున్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత

కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంపద

ఆళ్లగడ్డ: మేలు జాతి పశుసంపద అభివృద్ధికి కృత్రిమ గర్భాధారణ పద్ధతిని అనుసరిస్తున్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ లావణ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామీణ పశు వైద్యశాలలను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని పశు వైద్యశాల, వైఎస్సార్ పశు వ్యాధినిర్ధారణ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల ద్వారా దాణా విత్తనాలను పశు పోషకులకు అందించాలని చెప్పారు.డీడీ డాక్టర్ రమణయ్య, ఏడీ కొండారెడ్డి ఉన్నారు.

అడవి జంతువులకు హాని తలపెట్టొద్దు

రుద్రవరం: అడవి జంతువులకు హాని తలపెట్టొద్దని రుద్రవరం రేంజ్ ఇన్‌చార్జ్ అధికారి త్రినాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పందిర్లపల్లె సమీపంలో వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన మొక్క జొన్న పంటను అడవి జంతువులు ధ్వంసం చేశాయి. బాధిత రైతు అటవీ అధికారులకు సమాచారమివ్వడంతో రేంజర్ తన సిబ్బంది ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి,ఎఫ్‌బీఓలు సురేంద్ర గౌడ్,చాణక్యుడులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం పొలం వద్దకు వెళ్లి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

ఆళ్లగడ్డ: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి విద్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు చట్టాల గురించి వివరించి, పలు సూచనలు చేశారు. ఆయన మట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దని చెప్పారు. సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డి, శక్తి టీం సభ్యులు ఉన్నారు.

లింగ నిర్ధారిత వీర్యంతో మేలైన పెయ్యదూడలు

నంద్యాల(సెంట్రల్): పాడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తోందని విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డెయిరీ పరిపాలనా భవనంలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల్ని ఎలా పొందాలనే అంశంపై ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా ఏడాదికి ఒక దూడను పొందవచ్చని ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అరుణశ్రీ వివరించారు. పాలలో వెన్నశాతం ఎలా పెంచుకోవాలో సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్ తెలిపా రు. డెయిరీ ఉపసంచాలకులు రాజేష్, పశుసంవర్ధక శాఖ జిల్లా ఉపసంచాలకులు రమణమూర్తి, ఏడీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి